సాక్షి సంగారెడ్డి

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



గురుకులంలో మెరికలు

చదువుల్లో రాణిస్తూ.. క్రీడల్లో సత్తా చాటుతున్నారు జ్యోతిబాపూలే గురుకులాల విద్యార్థినులు. వివరాలు 8లో ▸



హైటెక్ పేకాట

పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి రూ. 12.50 లక్షల క్యాసినో కాయిన్స్ స్వా. ధీనం చేసుకున్నారు. 11 మంది జూదరులను అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



పత్తితీతకు వలస కూలీలు

పత్తితీత పనుల కోసం వలస కూలీలు వస్తున్నారు. ఇక్కడే కొన్ని నెలల పాటు నివాసముంటారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మల్లన్న జాతరకు రండి

హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేసిన బీఆర్‌ఎస్ నేతలు



హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామంలో ఈనెల 15న మల్లన్న కల్యాణం, జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాలకు హాజరుకావాలంటూ ఖేడ్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్, ఉపాధ్యక్షుడు జుర్రు నర్సింహులు, గ్రామ తాజా మాజీ సర్పంచ్‌లు రాజు, సిద్ధు, మాజీ ఎంపీటీసీ రాములుతోపాటు గ్రామపెద్దలు ఆదివారం హైదరాబాద్‌లో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలసి ఆహ్వానపత్రికను అందజేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ వద్దనున్న ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావులు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. జహీరాబాద్ మండలంలోని 445, మొగుడంపల్లి మండలంలోని 134, న్యాల్‌కల్ మండలంలోని 117, కోహీర్ మండలంలోని 165, ఝరాసంగం మండలంలోని 130 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేయనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. లబ్ధిదారులు ఆధారుకార్డు తీసుకుని హాజరుకావాలని కోరారు.

కేజీబీవీలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో పోస్టుల ఖాళీలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి తెలిపారు. వార్డెన్, అటెండర్, ఏఎన్‌ఎం, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్స్ ఇద్దరు, నైట్‌వాచ్‌మెన్ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుల ఖాళీలకు 10 రోజుల గడువులోగా అందోల్ కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పోస్టులభర్తీ జిల్లా విద్యాశాఖ నిబంధనలు ప్రకారం మండల విద్యా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలని, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కండేయ స్వామి భవన్‌లో నిర్వహించిన బీసీ రాజ్యాధికార సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దాసు సురేష్, బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాసు రామ్ నాయక్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రానున్న కాలంలో బీసీలే ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అధిక సంఖ్యలో పోటీ చేసి గెలవాలన్నారు. బీసీలకు మద్దతుగా ప్రచారం చేసి వారి గెలుపు లక్ష్యంగా అందరం కృషి చేస్తామన్నారు. నూతనంగా తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బహుజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బీసీ మహిళలకు సబ్‌కోటా లేని మహిళా రిజర్వేషన్‌లు మాకెందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడు తరహాలో రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును రద్దు చేయాలని కోరారు. బీసీలలోని మహిళలు, యువత భారీగా రాజకీయాల్లోకి రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంగా ఏడుపాయల



ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రం ఆదివారం జనారణ్యంగా మారింది. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని తరించారు. అర్చకులు దుర్గమ్మను పట్టువస్త్రాలతో అలంకరించగా.. భక్తులు ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

- పాపన్నపేట(మెదక్)

మల్లన్నకు పూజలు

కొమురవెల్లి మల్లికార్జు న స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగిరేణు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. కొంతమంది భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు.

కొమురవెల్లి(సిద్దిపేట):



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

నీరు పారే.. సాగు జోరే

జిల్లాలో 1,91,204 ఎకరాల్లో పంట సాగు అంచనా

- సింగూరు, నల్లవాగులో పుష్కలంగా నీరు
- బోరుబావుల వద్ద వరి సాగుకు రైతన్నల ఆసక్తి
- ఆరుతడి పంటగా జొన్న, మొక్కజొన్న



నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న నారుమడి

కల్హేర్(నారాయణఖేడ్): యాసంగి పంటల సాగుకు జిల్లా రైతాంగం సిద్ధమవుతోంది. ఈ ఏడాది 1,91,204 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలతో సింగూరు, నల్లవాగు ప్రాజెక్ట్, చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. బోరు బావుల వద్ద ఎక్కువమంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే వరి నారు వేసి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. జొన్న, మొక్కజొన్నతోపాటు కొద్దిపాటిగా శెనగ, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, తదితర పంటల్ని రైతులు సాగు చేసే అవకాశముంది. రైతులు దుక్కుదున్ని సాగుకు సిద్ధంగా ఉన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచే పనిలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటుండగా ఈ నెలాఖరు, జనవరి చివరి నాటికి నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంది. పంటల చివరి దశలో నీటి కొరత ఏర్పడితే ఇబ్బందులు పడకుండా ముందుచూపుగా ఆరుతడి పంటలే వేయాలని అధికారులు సూచిస్తున్నారు.

జొన్న, మొక్కజొన్న కూడా...

ఏటా యాసంగిలో రైతులు వరి తర్వాత ఆరుతడి పంటల సాగులో జొన్న, మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యతనిస్తారు. ఆరుతడి పంటలు జొన్న, మొక్కజొన్న వేస్తే మూడు నుంచి నాలుగు తడులు నీటి సరఫరా చేస్తే సరిపోతుంది. క్వింటాల్ జొన్నకు రూ.2,600, మొక్కజొన్నకు రూ.2,000 పైగా మద్దతు ధర లభించడంతో రైతులు వీటి వైపు ఆసక్తి చూపుతున్నారు.

యాసంగి పంటల సాగు అంచనా (ఎకరాల్లో)	
వరి	1,03,953
జొన్న	58,062
మొక్కజొన్న	5,347
ఇతర పంటలు	23,842

ఎరువులు, విత్తనాలు కొనుగోలు..

యాసంగిలో పంటల సాగు కోసం రైతన్నలు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. పంట సాగు అంచనాల మేరకు అధికారులు రైతుల కోసం ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వరితోపాటు మొక్కజొన్న, జొన్న, ఇతర విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉంది. రైతులకు దగ్గరలో ఉండేటట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించనున్నారు.

నల్లవాగు కింద సాగు పనులు..

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు అయిన నల్లవాగు ఆయకట్టు కింద ఆరుతడి పంటలు సాగు చేసే పనులు మొదలయ్యాయి. ప్రాజెక్టు కుడి కాల్వ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, మార్డి,ఖానాపూర్(కె) వరకు 2,989 ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలోని బోక్కస్‌గాం, అంతర్‌గాం, కామారెడ్డి జిల్లా మార్దండ, తిమ్మనగర్ గ్రామల వరకు 1100 ఎకరాల్లో ఆరుతడి పంటలు వేయనున్నారు. ఎమర్జెన్సీ కెనాల్ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి సమీపంలో 60 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. సింగూరు ప్రాజెక్టు ఆధారంగా అందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాల వరకు వరి సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

జొన్న వేయాలనుకుంటున్నా



యాసంగిలో జొన్న సాగు చేయాలనుకుంటున్నా. మా కుటుంబానికి 24 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయడంతో ఆయకట్టు కింద ఉన్న 16 ఎకరాల్లో జొన్న వేసేందుకు సిద్ధంగా ఉన్నాం. మరి కొంత వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మరికొన్ని ఇతర పంటలు వేస్తాం.

– రాజేందర్ పాటిల్, అంతర్గాం, సిర్గాపూర్ మండలం

సాగు సూచనలు పాటించాలి



రైతులు సాగు కోసం సూచనలు పాటించాలి. యాసంగిలో చలి ప్రభావం నుంచి వరి నారుమడి సంరక్షణ చర్యలు చేపట్టాలి. తక్కువ నీటి వాడకంతో ఆరుతడి పంటలైన జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలు వేస్తే బాగుంటుంది. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. పంట సాగులో తెగుళ్లు, ఇతర సమస్యలు వస్తే అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలి. వారి సూచన మేరకే మందులు వాడాలి.

– నూతన్‌కుమార్, వ్యవసాయాభివృద్ధి అధికారి, నారాయణఖేడ్

సమాజాన్నీ చదవాలి

- ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- ఖేడ్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్, చిత్రంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నాగేశ్వర్‌రావు

నారాయణఖేడ్: ఉపాధ్యాయులు విద్యాబోధనతోపాటు సమాజాన్ని సైతం చదువుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లాస్థాయి 6వ మహాసభలను మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యారంగం బలోపేతంకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... దేశ రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, సౌభ్రాతృత్వం, జాతీయ సమగ్రత వంటి అంశాలను నేటి పాలకులు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ...విద్యాభివృద్ధితోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తమ సంఘం ఆహ్వానిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్, సువర్ణ, కోశాధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శులు అమరేశ్వరి, శామయ్య క్రిష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు పంటల సాగు లక్ష్యం

- సింగూరు నుంచి 0.6 టీఎంసీల నీరు తరలింపు
- యాసంగి పంట కోసం నీటి విడుదల
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద ఏటా రెండు పంటలు సాగు కోసం లక్ష్యంగా పనిచేస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు నుంచి యాసంగి పంటల సాగు కోసం ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. గంగమ్మకు పూజలు చేసి ప్రాజెక్టులో తెప్ప వదిలారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ...సింగూరు నుంచి ఎత్తిపోతల ద్వారా 0.6 టీఎంసీల నీరు నల్లవాగు ప్రాజెక్ట్‌లో తరలించేందుకు ఎత్తిపోతల పనుల కోసం రూ.70 కోట్ల నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నల్లవాగు ప్రాజెక్టు పనులు పూర్తిచేయకుండా ఉన్న కాల్వలు ధ్వంసం చేశారని ఆరోపించారు.

న్యాయం కోసం పనిచేస్తా..: బీఆర్‌ఎస్ నాయకులు, కొందరు కావాలని తనను బద్నాం చేసేందుకు యత్నిస్తున్నారని.. న్యాయం కోసం తాను పనిచేస్తానని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. ఎవరైనా ప్రాజెక్టు నుంచి నీటివాడకంలో అక్రమాలకు పాల్పడితే పోలీసు కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పవన్‌కుమార్, మాజీ ఆట్మ (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) కమిటీ చైర్మన్ గుండు నరేందర్, నాయకులు యాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదోడికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- నూతన ఉపాధ్యాయులతో సమావేశం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రతీ పేదవాడికి పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, కల్హేర్ మండలాలకు సంబంధించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం 32మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 23మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా పార్టీ పరంగా చెక్కుల పంపిణీ చేపట్టారన్నారు. కాంగ్రెస్ సానుభూతిపరులుగా ఉన్నవారి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రెండుమూడేళ్లు ఆపి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కొందరి చెక్కులను చించేసిన ఘనత కూడా ఉందని గుర్తు చేశారు. కానీ తాము అలా కాకుండా పార్టీ రహితంగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వివాహం జరిగిన ఆరునెలల్లోపు చెక్కులు అందేలా చూస్తున్నామని తెలిపారు. పేదలు ప్రభుత్వం అందజేసిన పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యాభివృద్ధికి పాటుపడండి

ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని కోరారు. డీఎస్సీలో నూతన ఉపాధ్యాయులుగా ఎంపికై ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 164మంది నూతన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలని కోరారు.

పర్యాటక కేంద్రంగా సింగూరు

- పర్యాటక స్థలాల పరిశీలన
- డ్యామ్ మధ్య భాగంలో పడకంటిదీవి అభివృద్ధి
- సింగూరు గురుకులంలో మౌలిక సౌకర్యాలకు హామీ
- సింగూరులో మంత్రి దామోదర ఆకస్మిక పర్యటన



సింగూరు డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర

పుల్‌కల్/జోగిపేట(అందోల్): సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రం (టూరిజం హబ్)గా మారుస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సింగూర్ ప్రాజెక్టును మంత్రి దామోదర ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి స్థలాలను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మధ్య భాగంలో ఉన్న పడకంటి గడ్డపై టూరిజం అభివృద్ధి చేయడానికి అనుకూలంగా ఉంటుందా అని తెలుసుకున్నారు. గతంలో అభివృద్ధి చేసిన పనులను కూడా పరిశీలించారు. పర్యాటకులకు మరిన్ని సౌకర్యాల కోసం ఆ శాఖ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మత్స్యకారుల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

సిమెంట్ లైనింగ్ స్థలం పరిశీలన...

సింగూరు కాలువలు పూర్తి అయి దశాబ్దమైన వాటికి సిమెంట్ లైనింగ్ చేయలేదు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో సిమెంట్ లైనింగ్ చేయడానికి రూ.160 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులను శంకుస్థాపన చేయడానికి స్థలాన్ని, సభావేదిక స్థలాన్ని పరిశీలించారు. వచ్చే ప్రజలకు వసతుల కల్పనపై నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

సింగూరు గురుకుల పాఠశాలను, పాడల్ పాఠశాలను కూడా మంత్రి తనిఖీ చేశారు. సింగూరు గురుకుల పాఠశాలలో భోజనం బాలేదని విద్యార్థులు మంత్రికి ఫిర్యాదు చేశారు. సింగూరు గురుకులంలో క్రీడలకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల స్నానాల గదులను, శౌచాలయాలను శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మాడల్ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి పనులు తొందరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. మంత్రి దామోదర రాజనర్సింహ వెంట నీటిపారుదల శాఖ ఈఈ మధుసూదన్‌రెడ్డి,డిప్యూటీ ఈఈ నాగరాజు, ఆర్డీవో పాండు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళా విద్యకు కేంద్రంగా అందోల్



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి

మహిళా విద్యకు అందోల్‌ను కేంద్రంగా మారుస్తానని మంత్రి దామోదర పేర్కొన్నారు. అందోల్ నియోజకవర్గంలోని పలు విద్యా సంస్థల్లో మంత్రి పర్యటించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన మంత్రి, అక్కడి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆందోల్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ గరల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పర్యటించారు. భోజనం విషయంలో ఏదైనా తప్పు జరిగితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చలికాలం నేపథ్యంలో విద్యార్థులకు సరిపడా దుప్పట్లు అందజేయాలని, హాస్టల్ కిటికీలు పగిలిపోయినవి ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. అన్ని విద్యా సంస్థల చుట్టూ కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తున్నామని, నీటి, కరెంట్ సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంటర్నల్ రోడ్లు, గ్రౌండ్, లైబ్రరీ వంటి అన్ని సదుపాయాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. మంత్రి వెంబడి పలువురు అధికారులు, నాయకులు ఉన్నారు.

దత్తగిరిలో శిఖర పూజ

జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డా.సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో శిఖర పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున భక్తులు నిండు కలశాలతో ఆలయానికి చేరుకున్నారు.

ఝరాసంగం



క్లుప్తంగా

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి


యేసోబు(ఫైల్)

పాపన్నపేట(మెదక్): గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అర్కెలలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి యేసోబు (41) ఉదయం ఇంట్లో ఉండగానే తీవ్రమైన గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని పాపన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. యేసోబుకు భార్య కవిత, కుమారుడు ఉన్నారు.

కుటుంబాన్ని పోషించుకోలేక.. వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఒక వ్యక్తి తన కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుభాశ్ (40) బతుకుదెరువు కోసం తన కుటుంబంతో కలిసి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు. కుటుంబం పోషణ కోసం స్క్రాప్ ఏరుకొని విక్రయించేవాడు. ఈ క్రమంలో మద్యం తాగేవాడు. కుటుంబ పోషణ భారమై ముత్తంగి శివారు ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పరిశ్రమ సెక్యూరిటీ గార్డు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇక్కడికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పోలీసులు చేస్తున్నారు.

మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన మహిళ

అల్లాదుర్గం(మెదక్): ఎక్కిన బస్సు దిగేందుకు యత్నించిన మహిళ జారీ పడగా తీవ్రగాయాలైన సంఘటన అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామానికి చెందిన పారమ్మ జోగిపేటకు వెళ్లేందుకు గడిపెద్దాపూర్ చౌరస్తాలో బస్సు కోసం నిలబడింది. ఖేడ్ డిపోకు చెందిన బస్సు సంగారెడ్డికి వెళ్తుండగా ఫుట్ బోర్డు వరకు ప్రయాణికులు ఉన్నారు. ఆమె అదే బస్సులో ఎక్కింది. వెనుక మరో బస్సు వస్తుండటం గమనించి వెంటనే దిగేందుకు ప్రయత్నించి జారీ కింద పడింది. దీంతో తీవ్ర గాయాలైన క్షతగాత్రురాలిని 108లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మూర్ఛతో వ్యక్తి మృతి


సిద్దిరాములు మృతదేహం

రామాయంపేట(మెదక్): బంధువులతో కలిసి మద్యం తాగుతుండగా మూర్ఛ వచ్చి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జప్తిశివనూర్ గ్రామానికి చెందిన సిద్దిరాములు తన బంధువులతో కలిసి రామాయంపేటలో ఒక వెంచర్‌లో మద్యం తాగుతుండగా మూర్ఛ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. కేసును ఎస్‌ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో మెరికలు

- వర్గల్ స్టేట్ స్పోర్ట్స్‌మీట్‌లో సత్తా
- పతకాలు గెలిచిన విద్యార్థినులు



చదువుల్లో రాణిస్తూ.. క్రీడల్లో సత్తా చాటుతున్నారు జ్యోతిబా పూలే గురుకులాల విద్యార్థినులు. ఆటలో నైపుణ్యం ప్రదర్శించి చాంపియన్‌లుగా నిలిచారు. అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా ఒడిసిపట్టారు.. అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. చక్కని భవిష్యత్ కు బాటలు వేసుకుంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ పూలే గురుకులంలో నాలుగు రోజుల రాష్ట్రస్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్ నిర్వహించగా రాష్ట్ర నలుమూలల గురుకుల బాలికల తరలివచ్చారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారిణుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

– వర్గల్(గజ్వేల్):

చాంపియన్‌షిప్ దక్కించుకున్నా



నా పేరు నందిని. మాది జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం ఎల్కూరు గ్రామం. నేను ఉరుకొండపేట జ్యోతిబా పూలే గురుకులంలో ఏడో తరగతి చదువుతున్నా. మా వ్యాయామోపాధ్యాయులు చక్కని శిక్షణతో ఆటల్లో మెలకువలు నేర్పించారు. గురుకులంలో వనరులు వినియోగించుకుంటూ ప్రాక్టీస్ చేశా. వర్గల్ రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున అండర్-17 విభాగంలో 100 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్‌లో ప్రథమ, 200 మీటర్ల రన్‌లో ద్వితీయ స్థానంతో చాంపియన్‌షిప్ దక్కించుకున్నా. 2023 టోర్నీలోనూ రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్‌లో విజేతగా నిలిచా. మరిన్ని విజయాలతో కెరీర్‌కు మెరుగులు దిద్దుకుంటా.

– జీ. నందిని, మహబూబ్‌నగర్ జిల్లా

చదువుతోపాటు ఆటల్లోనూ..



నా పేరు సంజన. మాది నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామం. నేను ఆరో తరగతిలో నిజామాబాద్ అర్బన్ పూలే గురుకులంలో సీటు సాధించా. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నా. నాకు వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం. అండర్-19 జిల్లా జట్టు తరపున వర్గల్ టోర్నీలో పాల్గొన్నా. నిరుడు తమిళనాడులో జరిగిన నేషనల్స్‌లో పాల్గొన్నా. టోర్నీ ద్వారా వివిధ ప్రాంతాల క్రీడాకారులతో పరిచయం, అనిర్వచనీయ అనుబంధం ఏర్పడుతుంది. చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నదే నా పట్టుదల.

– టీ.సంజన, నిజామాబాద్ జిల్లా

పోలీస్ అవుతాను



నా పేరు పూజ. మాది సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి గ్రామం. నేను ఉమ్మడి మెదక్‌జిల్లా వర్గల్ పూలే గురుకులంలో ఇంటర్ చదువుతున్నా. నాకు రన్నింగ్ అంటే ఇష్టం. పోలీస్ కావాలన్నదే లక్ష్యం. మెదక్ జిల్లా జట్టు తరపున 100 మీటర్లు, 200 మీటర్లు, రిలే రేసులో విజేతగా నిలిచి వ్యక్తిగత చాంపియన్ సాధించా. గతంలో రాష్ట్రస్థాయి 1500 మీటర్ల పరుగు, 2018–19లో 100, 200 మీటర్ల పరుగులో జాతీయస్థాయి పోటీలో పాల్గొన్నా. మా గురుకులంలో చదువు, ఆటలకు చక్కని వనరులున్నాయి. అవి సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యం వైపు ముందుకు సాగుతా.

– పవార్ పూజ, ఉమ్మడి మెదక్ జిల్లా

సర్వతోముఖాభివృద్ధికి దోహదం

బాలికల సర్వతోముఖాభివృద్ధి మా గురుకులాల దోహదం. చదువుతో పాటు ఆటలకు సమప్రాధాన్యత. వర్గల్ గురుకులంలో చక్కని క్రీడా ప్రాంగణం ఉండడంతో అనేక పర్యాయాలు విజయవంతంగా మెగా టోర్నీలు నిర్వహించాం. అందరి సహకారంతో మరోసారి రాష్ట్ర టోర్నీ జయప్రదం చేశాం. టోర్నీ ద్వారా విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు ఇనుమడింపజేశాం.

– లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్, వర్గల్ పూలే గురుకులం

శ్రీసాయినగర్‌కాలనీలో చోరీ


బీరువా కింద కారం చల్లిన దుండగులు


ఘటన స్థలంలో మియాపూర్ ఏసీపీ నర్సింహారావు

- 46 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాల తస్కరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంట్లో యజమానులు నిద్రిస్తున్న క్రమంలో తలుపు లాక్ తీసి, లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బంగారం, వెండి ఆభరణాలు తస్కరించారు. ఈ సంఘటన రామచంద్రాపురం.. శ్రీసాయినగర్‌కాలనీలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీసాయినగర్ కాలనీలో నివాసముండే వేణుగోపాల్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి గ్రౌలెం పెట్టి డోర్స్‌కు లాక్ వేయడం మార్చిపోయి నిద్రపోయారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు కిటికీలో నుంచి గ్రౌలెం తీసి లోపలికి ప్రవేశించారు. వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఒక గదిలో నిద్రిసున్నాడు. ఎవరూ లేని మరొక గదిలోకి వెళ్లి ఇక్కడున్న బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 46 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.13వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాత్రూంకు వెళ్లేందుకు వేణు నిద్రలేచాడు. మరొక గదిలో బట్టలు అన్ని కింద పడేసి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దుండగులు వారి ఆనవాళ్లు గుర్తించకుండా బీరువా కింద, బట్టలపై, గదిలో కారంపొడి చల్లారు. రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, శ్రీకార్‌బాబు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. ఘటస్థలాన్ని మియాపూర్ ఏసీపీ నర్సింహారావు సందర్శించారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

అతివేగంగా కారు నడపడంతో వ్యక్తి మృతి అందోల్‌లో ఘటన

వట్‌పల్లి(అందోల్): ఓ వ్యక్తి కారు నిర్లక్ష్యంగా నడిపిన ఘటనలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన అందోల్ మండలం కిచెన్నపల్లి–కుసంగి రోడ్డు మార్గంలో జరిగింది. జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘనపూర్ మండలానికి చెందిన రామతీర్థం నాగరాజు(22) ఓ గొర్రెల కాపరి. జీవాలను మేపుకుంటూ శనివారం రాత్రి రోడ్డు పక్కన నిద్రించాడు. ఈ సమయంలో అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన వరదపాటి శ్రీకాంత్ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా అతివేగంగా కారును నాగరాజు తలపై నుంచి నడిపాడు. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

‘వండర్‌బుక్’లో శ్రీనివాస్‌చారికి చోటు

సూక్ష్మ కళాకారుల విభాగంలో ఎంపిక


జ్ఞాపిక అందుకుంటున్న శ్రీనివాసచారి

పెద్దశంకరంపేట(మెదక్): వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో మండల కేంద్రానికి చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి సూక్ష్మకళాకారుల విభాగంలో చోటు పొందారు. ఆదివారం సంగారెడ్డిలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేందర్, యువజన సంఘాల ప్రతినిధి కోన వేణు, వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రెసిడెంట్ సలీం సమక్షంలో ఆయనకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.

జాతీయస్థాయి జూడోకు ‘మోడల్’ విద్యార్థి


రామ్‌చరణ్

కోహెడరూరల్(హుస్నాబాద్): జాతీయ స్థాయి జూడో పోటీలకు మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న గుండారెడ్డిపల్లికి చెందిన మేడవేణి రామ్‌చరణ్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భరత్‌రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలో ఈనెల 3 నుంచి 5 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ తెలంగాణ అండర్19 రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో రామ్‌చరణ్ 90వేట్ కేటగిరిలో పాల్గొని బంగారు పతకం సాధించాడన్నారు. ఈనెల 11 నుంచి 17 వరకు పంజాబ్ రాష్ట్రంలో జరిగే అండర్ 19 జాతీయస్థాయి జూడో పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొంటాడని తెలిపారు.

వాలీబాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

దుబ్బాకటౌన్: రాష్ట్రస్థాయి అండర్19 వాలీబాల్ పోటీలకు దుబ్బాక మైనారిటీ కాలేజీకి చెందిన చందు ఎంపికయ్యాడు. గజ్వేల్ పట్టణంలో ఇటీవల జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 19 వాలీబాల్ ఎంపిక టోర్నమెంట్‌లో దుబ్బాక మైనారిటీ కాలేజీకి చెందిన చందు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విమలారెడ్డి అన్నారు. ఈనెల 10 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడలు పాల్గొంటాడన్నారు.


దుబ్బాకటౌన్: చందును అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ విమలారెడ్డి

మనీలాండరింగ్ కేసులో ఉన్నావంటూ టోకరా

- రూ. 1.50 లక్షలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: మనీ లాండరింగ్ కేసు పేరిట బెదిరించి, సైబర్ మోసానికి పాల్పడ్డారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓ కాలనీకి చెందిన వ్యాపారికి డిసెంబర్ 2న మనీలాండరింగ్ కేసులో ఉన్నావని ఆధార్, ఫోన్ నంబర్ ఉన్నాయని చెప్పి అపరిచిత వ్యక్తి భయపెట్టాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా రూ. 1.50 లక్షలు వేశాడు. తిరిగి మళ్లీ నగదు చెల్లించాలని, అడగడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం ఆదివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మోసపోయిన మహిళ ..


బాధితురాలు అరుణ

నిజాంపేట(మెదక్): ఆన్‌లైన్ మోసానికి ఓ మహిళ చిన్న మొత్తంలో నగదు పోగొట్టుకుంది. ఈ ఘటన నిజాంపేట మండలం నందిగామలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నందిగామకు చెందిన భోగ అరుణకు గుర్తు తెలియని వ్యక్తి రూ.25 వేల లోన్ ఇస్తామని ఫోన్ చేసి నమ్మించాడు. ఈ క్రమంలో ఒక లింక్ పంపించి దానిని ఓపెన్ చేయమని చెప్పాడు. ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగానే అకౌంట్‌లోని రూ.13,500 ఖాళీ అయ్యాయి. వెంటనే బాధితురాలు నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హైటెక్ పేకాట

- కొల్చారంలో దాడులు
- 11 మంది జూదరుల అరెస్టు
- రూ. 12.50 లక్షల క్యాసినో కాయిన్స్ స్వాధీనం
- పరారీలో నిర్వాహకులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

కొల్చారం(నర్సాపూర్): హైటెక్ తరహాలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు చేసి రూ. 12.50 లక్షల క్యాసినో కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. 11 మంది జూదరులను అరెస్టు చేశారు. ఈ ఘటన కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి శివారులో ఆదివారం జరిగింది. ఆ మేరకు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏడుపాయలకు వెళ్లే దారిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు టేకుల గడ్డ వద్ద గల శ్రీవనదుర్గ రెస్ట్ హోమ్‌లో పేకాట కొనసాగుతుందన్న విశ్వసనీయ సమాచారం శనివారం సాయంత్రం సమాచారం అందింది. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మెదక్ కు చెందిన ప్రత్యేక పోలీసు బృందం, కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజాము 1.30 గంటల ప్రాంతంలో పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి క్యాసినో కాయిన్స్, రూ.49.190 నగదు, 10 మొబైల్స్, క్యాష్ కౌంటింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరం నిర్వహిస్తున్న వెంకట్ రెడ్డి, సంతోశ్ సింగ్, శ్రీ వనదుర్గ రెస్ట్ హోం యజమాని సాయగౌడ్ అనే ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. జూదం హైటెక్ స్థాయిలో కొనసాగుతోంది. హైదరాబాద్ కు చెందిన వెంకట్ రెడ్డి, సంతోశ్ సింగ్ ఇద్దరు రెస్ట్ హౌస్‌ను అద్దెకు తీసుకొని, దాని యజమాని అయిన సాయగౌడ్‌ను కలుపుకొని జూదం నిర్వహిస్తున్నారు. డబ్బులు కాకుండా క్యాసినో కాయిన్స్ వినియోగిస్తున్నారు. ఒక్కొక్క కాయిన్ విలువ రూ.20వేలు ఉంటుంది. నిర్వాహకులు వివిధ ప్రాంతాలవారిని ఆడేందుకు తీసుకొస్తారు. పోలీసులు రైడ్ చేసిన సమయంలో డబ్బులు దొరకకుండా క్యాసినో కాయిన్స్ ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఆట పూర్తయిన తర్వాత నిర్వాహకులు కాయిన్స్ తీసుకొని నగదు అందజేస్తారని డీఎస్పీ తెలిపారు. దాడుల్లో పాల్గొన్న సిబ్బందిని ప్రశంసించారు.


పోలీసుల అదుపులో జూదరులు

వదలని వర్షం.. పత్తి రైతుకు కష్టం

పత్తి రైతుకు ఇప్పట్లో కష్టాలు తీరే పరిస్థితి కనిపించడం లేదు. అక్టోబర్ నెలలో కురిసిన వర్షాలు కృంగదీశాయి. అప్పటికే కూలీల కొరతతో సతమతవుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో లబోదిబోమంటున్నారు. పత్తి కాయలు తడిసి రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 3రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు
- దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో రైతులు


పత్తి పంట

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలో ఈసారి 3.90 లక్షలు ఎకరాల్లో పతి పంట వేశారు. ప్రారంభంలో సాగు ఆశాజనకంగా ఉంది. అక్టోబర్ మాసంలో ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రానుంది. ఇప్పుడు పత్తితీత పనులు చేపట్టేందుకు సైతం కూలీల కొరత వేధిస్తోంది. అధిక కూలి ఇచ్చి ఇతర ప్రాంతాల నుంచి వారిని రప్పించి పనులు చేపడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల పత్తి కాయలు నేల రాలిపోతున్నాయని వాపోయారు. రెండు రోజులుగా వర్షపు జల్లులు, శనివారం రాత్రి మాత్రం అధిక వర్షం కురవడంతో పంట బాగా దెబ్బతింది. న్యాల్‌కల్ మండలంలో వర్ష పాతం 30.3 మి.మీ, మొగుడంపల్లిలో 27.3, మునిపల్లిలో 15.3, రాయికోడ్ మండలంలో 12 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తక్కువ వర్ష పాతం నమోదైంది.

కాగా, పత్తి కాయలు నేల రాలడంతో పాటు వర్షం వల్ల తడిసి రంగు మారుతాయి. దీంతో పంట దెబ్బతిని నష్టపోతాం. అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మేము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోతాం



15 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కూలీల కొరత కారణంగా ఇంకా సగం పంట పొలంలోనే ఉంది. వర్షం పడుతుండడంతో పంట నేల రాలడమే కాకుండా రంగు కూడా మారుతోంది. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది.

– రాజప్ప రైతు, చాల్కి

గజ్వేల్ ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్మరణం
- గాడిచర్లపల్లి, పెద్దకోడూరులో విషాదం
- పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాల అప్పగింత
- ముగిసిన అంత్యక్రియలు


గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి వద్ద రోదిస్తున్న పరంధాములు కుటుంబసభ్యులు


రోదిస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్ కుటుంబీకులు

గజ్వేల్‌రూరల్, సిద్దిపేటజోన్: హైదరాబాద్‌లోని ఈసీఎల్‌లో జరుగుతున్న మారథాన్‌కు వెళ్లేందుకు బయలుదేరిన ఇద్దరు కానిస్టేబుళ్లు వెంకటేశ్, పరంధాములు మార్గమధ్యంలో గజ్వేల్ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ప్రమాదస్థలితో పాటు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్దకు చేరుకొని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మరణంలోనూ వీరి స్నేహం విడిపోలేదంటూ గుర్తు చేసుకొని కన్నీరుమున్నీరయ్యారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : సీపీ అనురాధ

ఇద్దరు పీసీలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పోలీసుశాఖకు తీరని లోటని, డిపార్ట్‌మెంట్ తరపున బెనిఫిట్స్‌ను త్వరలోనే బాధిత కుటుంబ సభ్యులకు అందించేందుకు చర్యలు తీసుకుంటానని సీపీ అనురాధ తెలిపారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ. 30వేల చొప్పున రూ. 60వేలను అందజేశారు. ముందుగా అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ(గజ్వేల్ ఇన్‌చార్జి) మధు, సీఐ సైదాలతో కలిసి ఆమె ప్రమాదస్థలం పరిశీలించారు. ఆపై ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాలను సందర్శించారు. వీరి వెంట పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తోటి పోలీసు సిబ్బంది ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే వీరు ప్రమాదంలో మృతి చెందడం పట్ల తోటి విచారం వ్యక్తం చేశారు.

గాడిచర్లపల్లిలో విషాదఛాయలు

కానిస్టేబుల్ పూసల వెంకటేశ్ మృతి వార్తతో ఆయన స్వగ్రామం సిద్దిపేట మున్సిపల్ గాడిచర్లపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన సత్తయ్యకు వెంకటేశ్ రెండో సంతానం. 2007 బ్యాచ్‌కు చెందిన అతను దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మారథాన్‌కు వెళ్లేందుకు బయలుదేరిన క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా గజ్వేల్‌లో పోస్టుమార్టం ప్రక్రియ అనంతరం సొంతూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సిద్దిపేట ఏసీపీ మధు, ఇతర పోలీస్ అధికారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశ్‌కు భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబీకులు, గ్రామ ప్రజలు విషాదంలో మునిగిపోయారు.

పెద్దకోడూరులో పరంధాములు..

చిన్నకోడూరు(సిద్దిపేట): కానిస్టేబుల్ వరుకోలు పరంధాములు అంత్యక్రియలు ఆదివారం ఆయన సొంతూరు పెద్దకోడూరులో జరిగాయి. సిద్దిపేట ఏసీపీ మధు పరందాములు మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. పరంధాములుకు భార్య కళ్యాణి, కూతురు, కుమారుడు ఉన్నారు. అంతిమ యాత్రలో రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరూ స్నేహితులే..


వెంకటేశ్, పరంధాములు (ఫైల్)

పరంధాములు, వెంకటేశ్ ఎక్కడ మారథాన్ పోటీలు జరిగినా పోలీసుశాఖ తరపున వెళ్లి పాల్గొనే వారు. మారథాన్ పోటీల్లో పాల్గొనే వారు ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకోగా అందులో సభ్యులుగా ఉన్న వీరు స్నేహితులుగా మారారు. ఇద్దరూ కలిసి తెలంగాణలోని సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాలైన ముంబై, న్యూఢిల్లీలో సైతం జరిగిన మారథాన్‌లలో పాల్గొన్నారు. వారు ఇక లేరని తెలుసుకొని గ్రూపులో ఉన్న తోటి మిత్రులు విషాదంలో మునిగిపోయారు.